
వినాయకనగర్‌లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు


సనత్‌నగర్‌లో సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు


ఎన్‌బీటీనగర్‌లో జరిగిన వేడుకల్లో పూజలు చేస్తున్న నగర్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు


బంజారాహిల్స్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు దీపక్ రెడ్డి

కమనీయం.. రాములోరి కల్యాణం

- కనులపండువగా శ్రీరామనవమి వేడుకలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు
- వేడుకలకు హాజరైన ప్రముఖులు

బంజారాహిల్స్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకలను ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని వీక్షించిన భక్తులు పులకించిపోయారు. పట్టు వస్త్రాలు, ప్రత్యేక అలంకరణలో ఉన్న సీతారాములను చూసేందుకు ఆలయాలు, చలువ పందిళ్ల వద్ద నిర్వహించిన వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా శ్రీరామ నామస్మరణ మార్మోగిపోయింది. కాలనీలు, బస్తీల్లో ఎక్కడ చూసినా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. శ్రీనగర్‌కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో లావణ్య దంపతులు పూజలు చేశారు. నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొన్నారు. బంజారాహిల్స్‌లో జరిగిన కల్యాణ మహోత్సవంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి పాల్గొన్నారు. ఎన్‌బీటీనగర్ అయ్యప్ప దేవాలయంలో జరిగిన వేడుకల్లో నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో..

బేగంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకొని సనత్‌నగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. సనత్‌నగర్‌లోని సెవెన్ టెంపుల్స్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. జెక్ కాలనీ, సి-టైపు క్వార్టర్స్, బేగంపేటలోని కేసరి హనుమాన్ దేవాలయంలో జరిగిన కల్యాణోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు టి.మహేశ్వరి, కొలను లక్ష్మి, నాయకులు టి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. సోమాజిగూడ బస్తీలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో కార్పొరేటర్ విజయారెడ్డి పూజలు చేశారు.

మధురానగర్‌లో..

వెంగళరావునగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మధురానగర్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో సాగి రామకృష్ణం రాజు కమ్యూనిటీ హాలులో సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. స్థానిక కార్పొరేటర్ దేదీప్య దంపతులు, యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ, మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోడె సాంబ శివరావు తదితరులు హాజరయ్యారు.

ఎర్రగడ్డ పరిధిలో..

ఎర్రగడ్డ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సమైక్య కమ్మ సంఘం మోతీనగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో ఏసీపీ శ్రీరమణ, బోరబండ సీఐ సురేందర్, కమ్మ సంఘం నాయకులు నరసింహారావు, బుల్లయ్య, మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్, రాజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాజీవ్‌నగర్ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, నరసింహ, దేరంగుల ప్రసన్న పాల్గొన్నారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో..

బంజారాహిల్స్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని స్వయంభు లక్ష్మీనర్సింహస్వామి(స్వర్ణ) దేవాలయంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. వేడుకల అనంతరం స్వామి వారికి పల్లకి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మూవ్‌మెంట్ అధ్యక్షుడు సత్య గౌరచంద్రదాస తదితరులు పాల్గొన్నారు.


ఫిలింనగర్‌లో అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్


టీటీడీ ఆలయంలో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కార్పొరేటర్ దేదీప్య తదితరులు


బంజారాహిల్స్ స్వర్ణ దేవాలయంలో శ్రీరామనవమి సందర్భంగా పెండ్లి కుమార్తె, పెండ్లి కుమారుడి అలంకరణలో సీతారాములు


మధురానగర్‌లో జరిగిన వేడుకల్లో పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి సునీత


అమీర్‌పేట సెవెన్ టెంపుల్స్‌లో వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకురాలు కోట నీలిమ తదితరులు


సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలో వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి తదితరులు


ఖైరతాబాద్‌లో శ్రీరామనవమి వేడుకలకు ముస్తాబైన సీతారామలక్ష్మణ సహిత హనుమాన్ విగ్రహాలు


సోమాజిగూడలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ విజయారెడ్డి తదితరులు


ఎర్రగడ్డ కల్పతరు అపార్టుమెంట్స్‌లో నిర్వహించిన వేడుకల్లో నాగమల్లేశ్వరరావు, డీవీవీ రావు, భాస్కర్ రెడ్డి, సంతోష్ గుప్తా, శ్రీనివాస్ రెడ్డి తదితరులు

గత ప్రభుత్వ హయాంలోనే కూకట్‌పల్లి అభివృద్ధి

- బీఆర్ఎస్ నాయకుడు సురేష్‌కుమార్

బేగంపేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయని, ఈ విషయాలపై అవగాహన లేకుండా కూకట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ బేగంపేట డివిజన్ అధ్యక్షుడు పి.సురేష్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆదివారం బేగంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావుపై కాంగ్రెస్ నేత బండి రమేష్ చేస్తున్న ఆరోపణలు అర్థరహితమైనవన్నారు. గత ప్రభుత్వంలో వందల కోట్ల రూపాయలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల జాడే లేదని విమర్శించారు.


నృత్య రూపక ప్రదర్శనలో కళాకారులు

ఆకట్టుకున్న శ్రీరాముని నృత్య రూపక ప్రదర్శన

మాదాపూర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ శిల్పారామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆదివారం ప్రవీణ వాడపల్లి శిష్య బృందం ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. శ్రీరాముని చరితం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. దశరథ పుత్రకామేష్టి యాగం, శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్న జననం, విశ్వామిత్ర యాగం, సీత కల్యాణం, రామవనవాసం, శూర్పణఖ ముక్కు చెవులు కోయడం, రావణాసురుడి ప్రవేశం, సీత అపహరణ, హనుమంతుడు కలవడం, సుగ్రీవుడి స్నేహం, లంక దహనం, రామ రావణ యుద్ధం, పట్టాభిషేకం ఘట్టాలను కళాకారులు ప్రదర్శించారు. నందిని, శ్రేయ, అమూల్య, అనన్య, దీప్తి, అహనా, అనఘా, కాశ్వీ, స్వాతి, ఆద్య, ప్రియ వర్షిణి, ధ్రువ, ప్రకృతి, రిషిక, గ్యానదా అదితి, ఆర్య, శశి తదితరులు తమ ప్రదర్శనతో మెప్పించారు.

గురుద్వారాలో హెల్త్‌కేర్ సెంటర్ ప్రారంభం

అమీర్‌పేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న బైశాఖీ ఉత్సవాలను పురస్కరించుకుని అమీర్‌పేట గురుద్వారాలో మోనీ బాబాజీ హెల్త్‌కేర్ సెంటర్‌ను ఆదివారం రాష్ట్ర గురుద్వారాల చైర్మన్ గురుచరణ్ సింగ్ బగ్గా ప్రారంభించారు. నామమాత్రపు ఫీజుతో ఆర్థో, గైనిక్, కార్డియాక్, జనరల్ ఫిజీషియన్‌లు అందుబాటులో ఉంటారని గురుద్వారా అధ్యక్షుడు దర్శన్‌సింగ్ వెల్లడించారు. గురుద్వారా సాహెబ్ మొదటి అంతస్తులో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ కుశ్వంత్ సింగ్, డాక్టర్, ప్రమోద్‌కుమార్, డాక్టర్ భూపిన్ బక్షితో పాటు కార్యదర్శి సురేందర్ సింగ్, గురుద్వారా చైర్మన్ అజిత్‌సింగ్, ప్రబంధక్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హెల్త్‌కేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న గురుచరణ్ సింగ్ బగ్గా

నైట్ సర్వీసులపై గ్రేటర్ ఆర్టీసీ ఫోకస్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో నైట్ సర్వీసుల సంఖ్యను పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ దృష్టిసారించింది. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే రూట్లలో రాత్రిపూట రద్దీకి తగినట్లు బస్సుల ట్రిప్పులు నడిపేలా 25 డిపోల వారీగా ప్రయాణికుల లెక్కలు తీస్తోంది. రాత్రి 9 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు శివారు ప్రాంతాల్లో ట్రిప్పుల సంఖ్య పెంచే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్‌రోడ్, పటాన్‌చెరు ప్రాంతాల్లో అర్ధరాత్రి వరకు ఆర్టీసీ సేవలు అందుబాటులో ఉన్నాయని.. అయినా రద్దీకి అనుగుణంగా వీకెండ్‌లో సర్వీసుల సంఖ్య పెంచుతున్నట్లు అధికారులు తెలిపారు. రాత్రి సర్వీసులపై ప్రయాణికుల నుంచి, డిపోల అధికారుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు చెబుతున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

అమీర్‌పేట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేటలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ మహంకాళి సికింద్రాబాద్ మాజీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్ పార్టీ శ్రేణులతో కలిసి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1980, ఏప్రిల్ 6న శ్యాంప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీ, ఎల్‌కే అద్వానీ ఆధ్వర్యంలో జనసంఘ్ బీజేపీగా అవతరించిందన్నారు. అప్పుడు ఇద్దరు ఎంపీలతో మొదలైన బీజేపీ వరుసగా మూడవసారి అధికారంలోకి వచ్చిందని, ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఆవిర్భవించిందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, కార్పొరేటర్ సరళ, డివిజన్ అధ్యక్షులు పవన్ కుమార్, భిక్షపతి గౌడ్, మహిళా నాయకులు పాల్గొన్నారు.


అమీర్‌పేట మైత్రివనం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ నేత బూర్గుల శ్యామ్‌సుందర్ గౌడ్

అన్ని ఎన్నికల్లో విజయం సాధిస్తాం

బోరబండ, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో భాగ్యనగరంపై కాషాయ జెండా ఎగరేస్తామని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్ రెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీపక్ రెడ్డి మాట్లాడుతూ.. ఇకపై జరిగే అన్ని ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. బోరబండ, రహ్మత్‌నగర్ డివిజన్ల అధ్యక్షులు కొత్త వెంకటేష్, తంగెళ్లపల్లి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు బంగారు ప్రశాంత్, కొలన్ సత్యనారాయణ, కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, శివరాజ్, రాంధారి బాబు, శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

బోరబండ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రహ్మత్‌నగర్ డివిజన్ కార్మికనగర్ బస్టాప్ వద్ద కాంట్రాక్టర్ ఆనంద్ రాజ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకుడు వి.నవీన్ యాదవ్‌తో కలిసి కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటుకు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. చలివేంద్రం ఏర్పాటు చేసిన కాంట్రాక్టర్ ఆనంద్ రాజ్‌ను ఆయన అభినందించారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్


మహ్మద్ గౌస్ కోసం చెరువులో గాలిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందాలు

దర్గా సందర్శనకు వచ్చి చెరువులో గల్లంతు

- 24 గంటలు దాటినా దొరకని ఆచూకీ

బిట్స్‌పిలానీ, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): కౌకూర్ దర్గాకు దర్శనానికి కుటుంబ సమేతంగా వచ్చిన ఓ వ్యక్తి స్నానానికి చెరవులోకి దిగి గల్లంతైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్‌నగర్ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫలక్‌నుమాకు చెందిన మహ్మద్ గౌస్(35) తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి కౌకూర్ దర్గా దర్శనానికి వచ్చారు. శనివారం స్నానం చేయాలని చెరువులోకి దిగారు. లోతు తెలియకపోవడంతో ప్రమాదవశాత్తు మహ్మద్ గౌస్ నీటిలో మునిగిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు గౌస్ కోసం గాలించగా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో వారు వెంటనే జవహర్‌నగర్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. 24 గంటలు గడిచినా మహ్మద్ గౌస్ ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



సదస్సులో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేస్తున్న అల్లం నారాయణ, విమలక్క, తేజావత్ బెల్లయ్యనాయక్ తదితరులు

'మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలి'

రాంనగర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మావోయిస్టులతో శాంతిచర్చలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని పలువురు వక్తలు కోరారు. ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాటపై తూటా-ప్రశ్నించే గొంతులు-పాలకుల అణచివేత అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ట్రైకార్ సంస్థ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, అరుణోదయ సంస్థ నిర్వాహకులు విమలక్క, జనసేన అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్, గద్దర్ ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి జీవీ.సూర్యకిరణ్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలకర శ్రీనివాస్, జస్టిస్ బి.చంద్రకుమార్, ప్రముఖ రచయిత వీణాకందస్వామి హాజరై మాట్లాడారు. దోపిడీ, పీడనలు ఉన్నంతకాలం ప్రజాపోరాటాలు కొనసాగుతుంటాయని, ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై జరిగిన కాల్పుల రోజును మరచిపోలేమని వారు పేర్కొన్నారు. ప్రజాసంస్కృతిని పాలకులు నిశ్శబ్దంగా మారిస్తే గద్దర్ ఆ నిశ్శబ్దాన్ని బద్దలు గొట్టారన్నారు. ప్రజాస్వామ్య వాతావరణాన్ని పాలకులు భగ్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రశ్నించే కవులు, రచయితలు, సామాజిక కార్యకర్తలను అర్బన్ నక్సల్స్‌గా కేంద్ర ప్రభుత్వం ముద్ర వేస్తోందని విమర్శించారు. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 149 మంది ఆదివాసీలను మావోయిస్టులుగా ముద్రవేసి హత్య చేశారని ఆరోపించారు. 2026 వరకు నక్సలిజాన్ని నిర్మూలిస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. బ్రాహ్మణీయ, హిందుత్వ ఫాసిజం రోజురోజుకూ పెరిగిపోతుందని.. మావోయిస్టులు ప్రకటించిన శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం బేషరతుగా ముందుకు రావాలని వారు డిమాండ్ చేశారు.

డీలర్లకు అవస్థలు.. పేదలకు ఎదురుచూపులు!

- సన్నబియ్యంతో నిండిన దుకాణాలు
- పంపిణీకి బ్రేక్ పడటంతో దొడ్డు బియ్యం పంపించిన అధికారులు
- నెలరోజుల పాటు ఇళ్లలోనే స్టోర్ చేసుకోవాల్సిన పరిస్థితి
- సన్నబియ్యం, అమ్మహస్తం కోసం పేదలకు తప్పని ఎదురుచూపులు

ఖైరతాబాద్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): చౌకధరల దుకాణాల్లో దొడ్డు బియ్యం తప్ప మరే సరుకులు లభించడం లేదు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించినా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉండటంతో మరో నెల రోజుల పాటు పేదలకు ఎదురుచూపులు తప్పడంలేదు. సర్కిల్ 7(ఖైరతాబాద్) పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీకి అన్ని ఏర్పాట్లు జరిగాయి. నగరంలోని అన్ని రేషన్ షాపులకు సన్న బియ్యం బస్తాలు రావడంతో పేదలు ఈ నెల నుంచే తమకు అందుతాయని ఆశపడ్డారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ ప్రారంభించినప్పటికీ నగరానికి సంబంధించి ఎమ్మెల్సీ ఎన్నికల ఉండటంతో ఇక్కడ ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది. కాగా అప్పటికే దుకాణాలకు చేరుకున్న సన్న బియ్యాన్ని షాపుల్లో నింపేసుకున్న డీలర్లు ఈ నెల సైతం దొడ్డు బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు రావడంతో రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సన్న బియ్యంతో దుకాణాలు నిండిపోవడంతో దొడ్డు బియ్యాన్ని పెట్టేందుకు స్థలం లేక సతమతమయ్యారు. స్పందించిన సివిల్ సప్లై అధికారులు సన్న బియ్యాన్ని నెల రోజుల పాటు డీలర్ల పర్యవేక్షణలో సమీపంలోని మరోచోట ఉంచేందుకు అనుమతించడంతో కొందరు తెలిసిన వారి దుకాణాల్లో, మరికొందరు తమ ఇళ్లలో, ఇంకొందరు అద్దె గదుల్లో దాచాల్సి వచ్చింది.

అమ్మహస్తం కోసం ఎదురుచూపులు

గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా అమ్మహస్తం పేరుతో తెల్లరేషన్ కార్డుల ద్వారా బియ్యంతో పాటు చక్కెర, కిరోసిన్, గోధుమలు, నూనె, కందిపప్పు, పసుపు, కారం, ఉప్పు, చాయ్ పత్తా, చింతపండు వంటి నిత్యావసర వస్తువులు తక్కువ ధరకు అందించేవారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తార్వత కేవలం బియ్యం మాత్రమే అందిస్తూ రేషన్ దుకాణాలను దొడ్డు బియ్యం పంపిణీ కేంద్రాలుగా మార్చేశారనే విమర్శలు వినిపించాయి. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వం అమ్మహస్తం పథకాన్ని తిరిగి ప్రారంభించాలని యోచిస్తోంది. అయితే విధివిధానాలు ఇంకా ఖరారు కాకపోవడంతో పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ప్రభుత్వం వీలైనంత త్వరగా పథకాన్ని ప్రారంభించి చౌక ధరల్లో నిత్యావసర వస్తువులను పంపిణీ చేసి పేదలను ఆదుకోవడంతో పాటు డీలర్లు సైతం కమీషన్లతో సంతృప్తిపడేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు.


దుకాణంలో స్థలం లేకపోవడంతో ఓ డీలర్ ఇంట్లోనే సన్న బియ్యం బస్తాలను ఉంచిన దృశ్యం


ఖైరతాబాద్‌లో సన్న, దొడ్డు బియ్యం బస్తాలతో నిండుకున్న ఓ చౌకధరల దుకాణం



ఎస్పీ రోడ్‌లోని హనుమాన్ ఆలయంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



హాజరైన భక్తులు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

శ్రీరామ నామస్మరణతో లష్కర్ మార్మోగింది. సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కాలనీలు, బస్తీల్లోని ఆలయాలు, ఫంక్షన్ హాళ్లు, కమ్యూనిటీ హాళ్ల నవమి వేడుకలతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఉదయం సీతారాముల కల్యాణం, సాయంత్రం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. స్థానిక భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు హాజరై శ్రీరాములోరి కల్యాణాన్ని తిలకించి భక్తిపారవశ్యంలో మునిగి తేలారు. ఆలయాల వద్ద ఉత్సవ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

(ఆంధ్రజ్యోతి- సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం)



జీరాలోని భజరంగ్ ఆలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బన్సీలాల్‌పేట కార్పొరేటర్ కుర్మ హేమలత, మాజీ కార్పొరేటర్లు



చిలకలగూడలో పాల్గొన్న ఏసీపీ జైపాల్‌రెడ్డి, బీజేపీ ప్రధానకార్యదర్శి మేకల సారంగపాణి తదితరులు



లాలాపేటలోని సీతారామాంజనేయ భజన సమాజంలో... జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్ రెడ్డి



తాడ్‌బండ్ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత



పహాడి హనుమాన్ గుడిలో కల్యాణంలో పాల్గొన్న కాంగ్రెస్ సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఆదం సంతోష్ కుమార్



జయలక్ష్మి గార్డెన్స్‌లో సామల రాఘవరెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవం



దండుమారమ్మ గుడిలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్ తదితరులు

ప్రజాస్వామ్య పరిరక్షణే బీజేపీ ధ్యేయం: ఎంపీ ఈటల

బోయినపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయంగా బీజేపీ కర్మసిద్ధాంతంతో పని చేస్తున్నదని, రాబోయే రోజుల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని మల్కాజగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మదా ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ సిఖ్‌విలేజ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీజేపీ 45వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై బీజేపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ, గాంధేయవాదమే తమ సిద్ధాంతమని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకే తమ పార్టీ ఆవిర్భావించిందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ బలపడుతోందని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొంతం దీపిక, నాయకులు శంకర్ విజయరామరాజు, అజయ్‌గౌడ్, శ్రీనివాస్, అనురాధ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జెండాను ఆవిష్కరించిన ఎంపీ ఈటల రాజేందర్, భానుక నర్మద, దీపిక తదితరులు

సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో..

బౌద్ధనగర్, ఏప్రిల్6 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్ల ఘనంగా నిర్వహించారు. సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం వద్ద సీనియర్ నాయకుడు ముఠా గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ముఖ్యఅతిథిగా పాల్గొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, ప్రభుగుప్తా, అంబాల రాజేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.

● నామాలగుండు చౌరస్తాలో సీనియర్ నాయకుడు సత్యంముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సికింద్రాబాద్ కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వినయ్, సంపత్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. బౌద్ధనగర్ డివిజన్లో వారాసిగూడ, పార్సిగుట్ట, అశోక్‌నగర్‌లో జరిగిన ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని బీజేపీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు దత్తు, చైతన్య, నగేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రెజిమెంటల్‌బజార్: భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మోండా డివిజన్ రెజిమెంటల్‌బజార్‌లో కార్పొరేటర్ కొంతం దీపిక బీజేపీ జెండా ఎగురవేశారు. కొంతం నరేష్, అంజన్‌కుమార్, మురళి,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాక

● మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు భూముల కేటాయింపుపై చర్చించేందుకే?

సికింద్రాబాద్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ జాయింట్ సెక్రటరీ రాకేష్ మిట్టల్ సోమవారం నగరానికి రానున్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో జరిగే కీలక సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూముల కేటాయింపుపై విస్తృతంగా చర్చించే అవకాశం ఉందని తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు పలు చోట్ల రక్షణ శాఖ భూములు అవసరం కావడంతో దీనిపై కేంద్ర రక్షణ శాఖకు విన్నవించింది. దీంతో కేంద్ర రక్షణ శాఖ స్పందించి, కీలక సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిసింది. అలాగే, సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి బోయినపల్లి మీదుగా సుచిత్ర వరకు, కార్ఖాన మీదుగా హకీంపేట్ వరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్ రహదారుల మీదుగా నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి అవసరమైన రక్షణ శాఖ భూములు రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించే విషయంపైనా సమావేశంలో చర్చించే అవకాశం ఉంది. సమావేశంలో మిలిటరీ ఉన్నతాధికారులు, కంటోన్మెంట్ బోర్డు ఉన్నతాధికారులు,రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, హెచ్ఎండీఏ ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిసింది.



డాక్టర్ పీవీ ఆనంద్ కుమార్ రెడ్డిని సత్కరిస్తున్న వైద్యులు

'కాళోజీ' హెల్త్ యూనివర్సిటీ వీసీకి సత్కారం

అడ్డగుట్ట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థి, ప్రస్తుత కాళోజీ నారాయణరావు హెల్త్ విశ్వ విద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ పీవీ ఆనంద్ కుమార్ రెడ్డి వైద్యరంగానికి చేసిన సేవలు ప్రశంసనీయమని పలువురు వైద్యులు పేర్కొన్నారు. గాంధీ ఆస్పత్రి ఆవరణలో ఉన్న అలుమిని భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆదివారం డాక్టర్ పీవీ ఆనంద్ కుమార్ రెడ్డిని వైద్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. జీఎంసీ అలుమిని ద్వారా బేసిక్ లైఫ్ సేవింగ్ కోర్సు పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో అలుమిని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి, డాక్టర్ రాజిరెడ్డితో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలింగార్చన స్వర్ణోత్సవాలు

మారేడుపల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి నెహ్రూనగర్ కాలనీలో పార్థివ మహాలింగార్చన స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కాశీవాసుల నిర్మల రామనాథ శర్మ ఆధ్వర్యంలో ఈ నెల 4న ప్రారంభమైన ఈ ఉత్సవా లు ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతాయి. ప్రతి రోజూ పుట్టమట్టితో తయారు చేసిన 365 లింగాలను వ్రతం పీఠంపై పెట్టి పూజలు నిర్వహిస్తున్నారు. నెహ్రూ నగర్ కాలనీలో పార్థివ మహాలింగార్చన కార్యక్రమం చేపట్టి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నామని రామనాథశర్మ తెలిపారు . భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పార్థివ మహాలింగార్చన పూజల్లో పాల్గొంటున్నారు.

రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని ప్రయాణికుడి మృతి



గుర్తుతెలియని ప్రయాణికుడి మృతదేహం

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్,ఏప్రిల్ 6 (ఆంధ్ర జ్యోతి): రైల్వే స్టేషన్‌లో ఓ ప్రయాణికుడు అనారోగ్యంతో మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం నెంబరు 1లో గుర్తుతెలియని 85 ఏళ్ల వృద్ధుడు ఆదివారం మరణించగా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద ఎలాంటి అడ్రస్ దొరకలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712658581, 8712568516 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిద్రలోనే మృత్యుఒడికి..



సెల్వరాజ్ మృతదేహం

బౌద్ధనగర్, ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): నిద్రలోనే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపిన వివరాల ప్రకారం.. వారాసిగూడ ఎల్.నారాయణనగర్ నివాసి జంపాల రాజేశ్ తన ఇంటి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఓ గదిని కేటరింగ్ పనులు చేసే సెల్వరాజ్(55)కు అద్దెకు ఇచ్చాడు. సెల్వరాజ్‌కు బంధువులు, కుటుంబసభ్యులు ఎవ్వరూ లేకపోవటంతో ఒక్కడే ఒంటరిగానే ఉంటున్నాడు. ఈనెల 4వ తేదీ రాత్రి ఎనిమిది గంటల తర్వాత భోజనం చేసిన సెల్వారాజ్ తనగదితో పడుకున్నాడు. ఐదో తేదీ ఉదయం 9 గంటలు కావస్తున్నా అతను గది తలుపు తీయకపోవడంతో ఇంటి యాజమాని రాజేష్ పలు మార్లు ఫోన్ చేశాడు. ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో కిటికీ తెరిచి చూడగా, సెల్వరాజ్ పడుకొని ఉన్నాడు. అనుమానం వచ్చి వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అపస్మారక స్థితిలో ఉన్న సెల్వరాజ్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారు. సెల్వరాజ్ మద్యం తాగడని, ఇతర అలవాట్లు కూడా లేవని, గుండెపోటులో మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇంటి యాజమాని ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చామని ఎస్‌ఐ తెలిపారు.